క్లుప్తంగా

సాయిబాబా మందిరంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు చేశారు. పట్టువస్త్రాలు సమర్పించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో ఆలయ ప్రాంగణంలో స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

గుంటి గంగను దర్శించుకున్న పీడీ



కోనేరును పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్

తాళ్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగమ్మను డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా ఆయన కోనేరును పరిశీలించి వివరాలు సేకరించారు. తొలుత గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. గుంటి గంగమ్మ దేవస్థానం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఏపీడీ లలితకుమారి, ఆలయ చైర్మన్ గురుబ్రహ్మం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గురుబాబు, టెక్నికల్ అసిస్టెంట్ కోటి, ఫీల్డ్ అసిస్టెంట్ డానీ పాల్గొన్నారు

తాగునీటి సమస్య తీర్చాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దళిత సేన నాయకులు

దర్శి (కురిచేడు): మండలంలోని తూర్పు చౌటపాలెం ఎస్సీ కాలనీకి మంచినీరు సరఫరా చేయాలని రాష్ట్ర దళిత సేన నాయకులు ఎంపీడీఓ కృష్ణమూర్తికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు గర్నెపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సంవత్సరం నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై అనేక సందర్భాల్లో అధికారులుకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మంచినీటి సరఫరా చేసి దాహార్తి తీర్చాలని కోరారు. రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే, దంతులూరు కోటేషు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

దర్శి (కురిచేడు): డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా దర్శి నియోజకవర్గంలోని మండల కమిటీ అధ్యక్షులను గురువారం నియమించారు. దర్శి టౌన్ అధ్యక్షుడిగా సిరిమల్లె పొలేష్, దర్శి రూరల్ అధ్యక్షుడిగా కరిపిరెడ్డి శ్రీరామిరెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడిగా మారం కోటిరెడ్డి, తాళ్లూరు మండల అధ్యక్షుడిగా కూకట్ల వీరబ్రహ్మం, దొనకొండ మండలం అధ్యక్షుడిగా రామిరెడ్డి శివారెడ్డి, కురిచేడు మండలం అధ్యక్షుడిగా షేక్ మీరావలిలను నియమించారు. వారికి దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ కైపు వెంకట కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

కాలువలో మృతదేహం



కాలువలో ఉన్న మృతదేహం

కురిచేడు: నాగార్జున సాగర్ కుడి కాలువలో మండలంలోని కాటంవారిపల్లె వద్ద స్థానికులకు గురువారం మృతదేహం కనిపించింది. మృతదేహం ఉండటంతో పశువులు నీరు తాగడం లేదు. గ్రామస్తులు మృతదేహాన్ని లోపలకు నెట్టడంతో అది కాలువలో కొట్టుకుపోయిందని ఎస్సై శివ తెలిపారు. ఆ తర్వాత గాలించినా కనిపించ లేదని ఆయన స్పష్టం చేశారు.

భానుడి ప్రతాపం



తోకపల్లి పొలంలో చెట్ల నీడన సేదతీరుతున్న గేదెలు

పెద్దారవీడు: రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మెట్ట ప్రాంతంలో ఒక్కసారిగా పెరిగిన ఎండలతో పశువులు, జీవాలు బెంబేలెత్తిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సూర్యుడి ప్రతాపానికి ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ఎండల నుంచి పశువులు, జీవాలను రక్షించుకునేందుకు కాపరులు నానా తంటాలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఎండలకు భయపడి మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై తిరిగేందుకు సాహసించడం లేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లపై జనసంచారం అంతగా కనిపించడం లేదు. పశువులు, జీవాల కాపరులు 10 గంటలకే ఎండ వేడిమిని తట్టుకోలేక పొలాల్లో చెట్ల కింద మందను సేద తీరుస్తున్నారు. రోడ్లు మండుతున్న కొలిమిలా మారడంతో వాహనదారులైతే పగటి పూట ప్రయాణం చేయాలంటే చుక్కలు చూస్తున్నారు. వేసవి ప్రారంభంతోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఇంకెంత దారుణంగా ఉంటాయోనని ప్రజలు హడలి పోతున్నారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ముదురుతున్న ఎండలతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. పరీక్షలు రాసిన తర్వాత ఆ సమయంలో ఎండలో ఇళ్లకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. వేసవి కాలం ప్రారంభమైనా మండలంలో ఎక్కడా చలివేంద్రాల జాడ కానరావడం లేదు.

గిరిజనుల అభ్యున్నతికి ఎనలేని కృషి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శివప్రసాద్

యర్రగొండపాలెం: గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని శ్రీశైలం ఐటీడీఏ పీవో శివ ప్రసాద్ అన్నారు. మండలంలో అసిస్ట్ సేవా కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా గురువారం స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా చెంచు గిరిజనుల అభ్యున్నతికి వేలాది కోట్లు ఖర్చు పెడుతున్నామని, అయినా వారు ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నల్లమల అడవుల్లో జీవనం సాగిస్తున్న చెంచుల అభివృద్ధికి తోడ్పడేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని, అనేక ప్రాంతాల్లో వారు నివశించేందుకు పక్కా గృహాలు, తాగు నీటి వసతి, రహదారులు ఏర్పాటు చేయాలని కోరారు. చెంచు పిల్లల చదువుల కోసం, బాల్య వివాహాల నివారణ, లింగ వివక్షత వంటి సమస్యలు లేకుండా సేవా సంస్థలు అవగాహన కల్పించాలని చెప్పారు. తమ పిల్లలను పాఠశాలలకు పంపి చదివిస్తే తమతో పాటు తమ సమాజం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని చెంచు కుటుంబాలు గుర్తించాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకొని పురోభివృద్ధి చెందాలన్నారు. 35 ఏళ్ల నుంచి అసిస్ట్ సంస్థ చెంచుల అభివృద్ధికి పాటు పడుతోందని, ఇప్పటి వరకు పెద్దదోర్నాల, పుల్లలచెరువు మండలాల్లో ఉన్న చెంచు గూడేల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు స్పష్టం చేశారు. యర్రగొండపాలెం మండలంలోని చెంచులను అభివృద్ధి దిశలో నడిపేందుకు తమ సంస్థ ముందుకొచ్చిందని, ఈ అవకాశాన్ని ప్రతి చెంచు కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్ విష్ణుప్రియ, కో ఆర్డినేటర్ రామారావు, ఉపాధి ఐటీడీఏ ఏపీవో నాగేశ్వరరావు, ఎంఈవో పి.ఆంజనేయులు, చెంచు గిరిజన నాయకుడు చెవుల అంజయ్య, గంజివారిపల్లె, వెంకటాద్రిపాలెం సర్పంచ్‌లు డి.సుబ్బారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నేతల పరామర్శ



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



వెంకటేశ్వరరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెన్నా వెంకటేశ్వరరెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం పరామర్శించారు. తొలుత వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి మాజీ మంత్రి సురేష్ పూలమాలవేసి సంతాపం తెలిపారు. అనంతరం చంద్రశేఖర్ మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరరెడ్డి మృతి పార్టీకి తీరని నష్టమని, ఆయన కుటుంబానికి తాము అన్ని విధాలా అండదండలు అందిస్తామన్నారు. మృతుడి కుటుంబానికి వారు సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జనరల్ సెక్రటరీ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, వివిధ విభాగాల నాయకులు ఒంగోలు సుబ్బారెడ్డి, ఏకుల ముసలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, కొల్లి సత్యనారాయణరెడ్డి, షేక్ వలి ఉన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలోని హుండీ బుధవారం రాత్రి చోరీకి గురైంది. హుండీలోని సుమారు రూ.50 వేలకు పైగా నగదు చోరీకి గురైందని ఆలయ ధర్మకర్త కాట్రెడ్డి శివరామిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎం శివ కేసు నమోదు చేసి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ప్రతి సంవత్సరం మేలో స్వామి వార్షికోత్సవం జరుగుతుందని, ఆ సమయంలో హుండీ లెక్కిస్తే రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు వస్తుందని ధర్మకర్త తెలిపారు. మరో రెండు నెలల్లో వార్షికోత్సవం ఉందని, సుమారు రూ.50వేల పైగా నగదు ఉండొచ్చని అంచనా వేసినట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సిలిండర్ నుంచి మంటలు

- నిత్యావసరాలు దగ్ధం

దొనకొండ: గ్యాస్ సిలిండర్ లీకై వచ్చిన మంటలతో నిత్యావసరాలు దగ్ధమైన సంఘటన మండలంలోని సిద్ధయ్యపాలెంలో గురువారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగరాజు రోడ్డు పక్కన దుకాణం ఏర్పాటు చేసుకుని నిత్యావసర వస్తువులతో పాటు బజ్జీలు, బోండాలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. బజ్జీలు తయారు చేసే క్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న ప్రజలు పరుగులు తీశారు. అప్రమత్తమైన కొందరు మంటలు ఆర్పారు. ప్రమాదంలో సుమారు రూ.20 వేల విలువ చేసే నిత్యావసర వస్తువులు దగ్ధమైనట్లు నాగరాజు తెలిపారు. ఎవరికీ ప్రాణాపాయం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



దగ్ధమైన నిత్యావసరాలు

సచివాలయ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేజ్ సర్వేయర్లు

దొనకొండ: ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా ఒత్తిడికి లోనవుతున్నామని, అనారోగ్యాలకు గురవుతున్నామని సచివాలయాల సర్వేయర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు గురువారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితి ప్రకారం రీ సర్వే చేసేందుకు అవకాశం కల్పించాలని, విస్తీర్ణం ఆధారంగా కాల పరిమితిని పెంచి వెసులుబాటు కల్పించాలని, ఆఫీసు పనివేళల్లో మాత్రమే పని చేసే విధంగా వెసులుబాటు కల్పించాలని, సెలవు రోజుల్లో రీ సర్వే పని చెప్పకుండా తగు ఆదేశాలు ఇవ్వాలని, సీసీఎల్ఏ ఆదేశాల ప్రకారం రీ సర్వేలో ఉన్న విలేజ్ సర్వేయర్లకు ఇతర పనులు కేటాయించకుండా ఆదేశాలు ఇవ్వాలని, రీ సర్వేలో ఎవరి లాగిన్ వారు మాత్రమే చేసే విధంగా తగు ఆదేశాలు జారీ చేయాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. రీసర్వే విధులు నిర్వహిస్తున్న గ్రామ సర్వేయర్‌లకు బయో మెట్రిక్ అదర్స్ ఆప్షన్ సదుపాయం కల్పించాలని, డేటా ప్రాసెసింగ్ సెంటర్ డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేయాలని, రీ సర్వే టీమ్‌లను గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తయ్యే వరకు అవే టీమ్‌లను కొనసాగించాలని, రీ సర్వే పూర్తయిన ఫేస్–2, ఫేస్–3 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు.

నీటి సమస్య పరిష్కరించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సోమయ్య



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలోని సుందరయ్య కాలనీలో నాలుగు నెలలుగా నీటికి తీవ్ర ఇబ్బందులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య మండిపడ్డారు. మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీకి సంబంధించి చెంచు గిరిజనుల నీటి ఇబ్బందులపై పంచాయితీ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. నీటి ఇబ్బందులకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు కాలనీకి సంబంధించి స్తంభాలకు సైతం విద్యుత్ తీగలు కూడా లేవన్న విషయం పేర్కొంటూ ఆ శాఖ ఏఈకి సైతం వినతి పత్రం అందజేశారు. అధికారులు ఆయా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. సీపీఎం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, గోన దావీదు, ఏసోబు, పొనుగంటి పిచ్చయ్యతో పాటు కాలనీ వాసులు కుడుముల బయ్యన్న, ఈదర మల్లయ్య, వీరమ్మ, బయ్యన్న, వెంకటేశం పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన శిక్ష

బేస్తవారిపేట: నాటుసార తయారు చేస్తే 8 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తామని కంభం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎస్ కొండారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కోనపల్లెలో నవోదయం 2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గిరిజన గూడెం ప్రజలు నాటుసారా రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుల నియామకం



ముసలారెడ్డి



రమణారెడ్డి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులను కేంద్ర పార్టీ కార్యాలయం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. యర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షుడిగా ఏకుల ముసలారెడ్డి, పెద్దదోర్నాల మండల అధ్యక్షుడిగా గంటా వెంకట రమణారెడ్డిలను నియమించింది. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని, తమకు పదవులు వచ్చేందుకు ప్రధాన కారకులైన ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నగర పంచాయతీ అధ్యక్షుడిగా ముత్తినీటి సాంబశివరావు, దర్శి మండల అధ్యక్షుడిగా వెన్నపూస వెంకటరెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడిగా చింతా శ్రీనివాసరెడ్డి, దొనకొండ మండల అధ్యక్షుడిగా కాకర్ల కృష్ణారెడ్డి, తాళ్లూరు మండల అధ్యక్షుడిగా తూము వెంకట సుబ్బారెడ్డి, కురిచేడు మండల అధ్యక్షుడిగా యన్నాబత్తుల వెంకట సుబ్బయ్యలను నియమించారు.

డ్రాపౌట్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలి

- ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్



చెంచు విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శివప్రసాద్

యర్రగొండపాలెం: చెంచు గిరిజన బాల, బాలికలు పాఠశాలలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, చెంచు విద్యార్థుల డ్రాపౌట్లు లేకుండా చూడాలని శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకట శివ ప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక మినీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెంచు విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలని, విద్యార్థులు తమ సొంత ఊర్లకు వెళ్లి తిరిగి పాఠశాలకు రాకుంటే వారు పాఠశాలకు తీసుకొచ్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గిరిజన బాల, బాలికల విద్యకు సంబంధించి అశ్రద్ధ వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తొలుత 5, 6, 7 తరగతులు చదువుతున్న విద్యార్థుల విద్య పురోగతిని ఆయన పరిశీలించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో క్రమం తప్పకుండా స్టడీ అవర్స్ నిర్వహించాలని, ఆ ఫొటోలను శ్రీశైలం వాట్సప్ గ్రూపులో పెట్టాలని ఆయన ఆదేశించారు. మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పిస్తున్నారా, లేదా అనే విషయంపై ఆరా తీశారు.

క్రమశిక్షణ కోసమే స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్



విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: బాల, బాలికల్లో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దేందుకే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపయోగపడుతుందని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మంచి నడవడిక, శరీర ధారుడ్యం, భావిభారత పౌరులుగా ఎదిగేందుకు అవసరమైన శిక్షణ లభిస్తుందన్నారు. హైస్కూల్లో ఎన్‌సీసీతో పాటు స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ఉండటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, స్కౌట్స్ యూనిట్ శిక్షకురాలు రజని, ఉపాధ్యాయులు భాస్కర్, బాదరయ్య, కోటా నాయక్, మత్తయ్య పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను సీఐకు అందజేస్తున్న గూడా బ్రదర్స్

తాళ్లూరు: స్థానిక పోలీసుస్టేషన్‌కు గూడా వెంకట రెడ్డి సుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కంప్యూటర్ బహూకరించారు. దర్శి సీఐ రామారావు, ఎస్సై మల్లికార్జునరావుకు గూడా ప్రసాద్‌రెడ్డి, గూడా శ్రీధర్‌రెడ్డి, గూడా రాజశేఖర్‌రెడ్డి, గూడా సాయి ఫణీంద్రరెడ్డిలు కంప్యూటర్ బహూకరించారు. గూడా చిన్న బ్రహ్మారెడ్డి, గూడా గోపాల్‌రెడ్డి, గూడా వెంకట సుబ్బారెడ్డి, గూడా జయరామి రెడ్డి కుమారులైన వీరు పోలీసుస్టేషన్‌కు కంప్యూటర్ వితరణగా ఇవ్వటం అభినందనీయమని సీఐ రామారావు అన్నారు. వీరి సేవలను ఆయన ప్రశంసించారు. వీరు మండలంలో మరెన్నో అభివృద్ధి పనులు చేయాలని ఆకాంక్షించారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి పాఠ్య పుస్తకాలు చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో ఇందిర అన్నారు. గురువారం మండలంలోని చౌటపాచర్ల, అయ్యగానిపల్లి, లెనిన్‌నగర్, ఐటీవరంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఆహార పదార్థాలు రుచి చూశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రాయడం, చదవడం నేర్పించాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు అంశాలను చదవడం, రాయడం నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను నూతన పద్ధతుల్లో విద్యార్థులకు సులభతరంగా బోధించాలని సూచించారు. ప్రభుత్వం మెనూ అమలు చేస్తూ విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

రైతు విశిష్ట సంఖ్య కోసం ప్రత్యేక శిబిరాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమానికి సంబంధించి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. గురువారం తురకపాలెంలో నిర్వహించిన క్యాంపులో రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, ఇతర రైతు సంక్షేమ పథకాలు పొందేందుకు వీలుంటుందని చెప్పారు. మండలంలో ప్రస్తుతం 6 వేల మంది రైతులు పేర్లు నమోదు చుసుకున్నారని పేర్కొన్నారు. ఓటీపీల ద్వారానైనా విశిష్ట సంఖ్య పొందాలని చెప్పారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో వీఏఏలు ముమ్మరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆత్మ ఏటీఎం కె.రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.